రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

విశాలాంధ్ర-నెల్లిమర్ల : రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే అండర్-19 విభాగం జిల్లా జట్టును నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో బుధవారం ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో నాగ వెంకట్ (48-50), రోహిత్(50-55), ఎర్రి నాయుడు (55-60), ప్రవీణ్(60-65), కిరణ్(70-75), సూర్య తేజ(80-85), బాల కుమార్(85-90), లోకేష్(90ం) ఎంపికయ్యారు. వీరు త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ ఎంపిక పోటీలను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మద్దిల అప్పలనాయుడు, జనరల్ సెక్రెటరీ లక్ష్మణరావు, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కాళ్ల మహేష్ తదితరులు నిర్వహించారు.

పిఆర్ రోడ్లు కనెక్టివిటీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

సంబంధిత శాఖ అధికారులతో ఎమ్మెల్యే బేబీ నాయన సమావేశం

విశాలాంధ్ర-బొబ్బిలి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరుచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎమ్మెల్యే బేబీనాయన పిలుపునిచ్చారు. బుధవారం రాజా ప్యాలెస్‌లో ఎమ్మెల్యే బేబీ నాయన అధ్యక్షతన పంచాయతీరాజ్ సంబంధిత శాఖ అధికారులు తో రోడ్ల కనెక్టివిటీ ప్రతిపాదనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ పరిధి నాలుగు మండలాలలో గ్రామాల రోడ్ల కనెక్టివిటీపై పిఆర్ డిఈ, ప్రాజెక్ట్స్ డిఈలతో సమీక్ష సమావేశం ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన నిర్వహించారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాలకు రోడ్ల అనుసంధానం(కనెక్టివిటీ) ఉండాలనే సంకల్పంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బేబీనాయన పిఆర్ డిఈ, ప్రాజెక్ట్స్ డిఈ లతోలి చర్చించారు. గత ఐదు సంవత్సరాలలో గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు రోడ్ల నిర్మాణం చేపట్టలేదని మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు హయాంలో మంజూరైన పనులను కూడా గత ప్రభుత్వం విస్మరించడంతో దాదాపు 43 గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లులేక నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాబోవు ఆర్థిక సంవత్సరంలో (2025-26)లో మొదటి విడతగా ఒక 16 గ్రామాల మధ్య పక్కా రోడ్ల నిర్మాణంజరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించగా, అందుకుగాను సుమారు 20 కోట్లు కేటాయించవలసి ఉంటుందని అధికారులు అంచనా తెలిపారు. మిగతా నాలుగు సంవత్సరా లలో మలి విడతలలో మిగిలిన గ్రామాలకు కూడా కనెక్టివిటీ రోడ్ల కొరకు కావాల్సిన నిధుల వివరాలు తయారుచేయమని అధికారులను ఆదేశించారు. వీటితో పాటు, నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో ఇంటర్నల్ రోడ్లు, కాలువ నిర్మాణాల కోసం మరొక రూ20 కోట్లకుఅంచనాలు తయారు చేశారు. ఈసంవత్సరానికిగాను 40 కోట్లతో ప్రతి గ్రామంలో రోడ్లు, కాలువలు నిర్మించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలనే సంకల్పంతో ఎమ్మెల్యే బేబీనాయన సంబంధిత మంత్రితో చర్చించి వీలైనంత త్వరగా నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

వల్లంపూడి ఎస్సై బొడ్డు దేవిని సస్పెండ్ చేయాలి

- దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా హోరెత్తిన నిరసన గళం

- ఉలిక్కిపడ్డ వేపాడ మండల కేంద్రం

విశాలాంధ్ర-వేపాడ : వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవిని సస్పెండ్ చేయాలంటూ మండల కేంద్రమైన వేపాడలో దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ధర్నా నిరసన గళం హోరెత్తడంతో మండల కేంద్రమైన వేపాడ వల్లంపూడి జంట గ్రామాలు ఉలిక్కిపడ్డాయి.రాష్ట్ర దళిత కూలి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రముఖ న్యాయవాది గాలి ఈశ్వరరావు పిలుపుమేరకు మండలంలోని దళిత సంఘాలన్ని ఏకమై ధర్నాతో పాటు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత యువకుడైన గుడివాడ మోహన్‌పై వల్లంపూడి ఎస్సై బొడ్డు దేవి దౌర్జన్యంగా కొట్టడమే కాకుండా అక్రమంగా కేసులు బనాయించి 14 రోజులకు పైగా రిమాండ్ కు తరలించి చిత్రహింసలు పెట్టడం అన్యాయం అంటూ అలాంటి ఎస్సై బొడ్డు దేవిపై చార్జిషీట్ ఓపెన్ చేసి సస్పెండ్ చేసి విధుల నుండి తప్పించాలని, అంబేద్కర్ ఆశయాలను అమలు చేయాలని,బలుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలని వల్లంపూడి పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేయడంతో పాటు తమ నిరసన గళం విప్పారు.అనంతరం జంట గ్రామాలైన వేపాడ వల్లంపూడి గ్రామాలలో భారీగా ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసిల్దార్ జె.రాములమ్మకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆమెకు అందించి రిసీవ్ కాపీ తీసుకున్నారు.అలాగే ఈ డిమాండ్లతో కూడిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ,డీఎస్పీ, సర్కిల్ కార్యాలయానికి అందిస్తామన్నారు.ఈ విషయంపై ఎటువంటి న్యాయం జరగకపోయినచో హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అలాగే ఆతవ గ్రామానికి చెందిన ఆతవ నాగరాజు డప్పు రాజుల ఆధ్వర్యంలో అంబేద్కర్ గేయాలతో ఉద్యమానికి మరింత ఉత్సాహాన్ని నింపారు. అనంతరం చేపట్టిన ఈ ధర్నా నిరసన కార్యక్రమంలో వేపాడ మండల మాల మహానాడు అధ్యక్షుడు దేబార్కి కిరణ్,బీఎస్పీ ఎస్.కోట అధ్యక్షుడు ధోని అప్పారావు, కన్వీనర్ బోను రమణ,ప్రధాన కార్యదర్శి గాలి చైతన్యకుమార్, కన్వీనర్ కొట్యాడ అప్పారావు, వేపాడ మండల దళిత నాయకులు బోను అప్పారావు, తదితరులతో పాటు మండలంలోని అన్ని గ్రామాల దళిత, నాయకులు మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలలో భాగంగా విజయనగరం ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పి ఎం. వీరాకుమార్,ఎస్ కోట రూరల్ సి.ఐ ఎల్.అప్పలనాయుడు, ఎల్ కోట ఎస్.ఐ నవీన్ పడాల్,ఎస్ కోట సర్కిల్ ఫోర్సు, స్పెషల్ ఫోర్సు తదితరుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏపీ రెల్లి కులస్తులకు రిజర్వేషన్ పెంచాలని నిరసన కార్యక్రమం

విశాలాంధ్ర -గజపతినగరం: గజపతినగరం నాలుగు రోడ్ల కూడలి వద్ద బుధవారం నిర్వహించిన రెల్లి కులస్తుల నిరసన కార్యక్రమాన్ని జిల్లా రెల్లి ఉప కులాల సంఘ అధ్యక్షులు సోము మురళీమోహన్ అధ్యక్షతన జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీలో రెల్లి ఉప కులాలకు (ఎస్సీ)లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని రెల్లి కులస్తులు నాన అగచాట్లు పడుతున్నారని మురుగు తీయడం రోడ్లు తుడవడం రిక్షా లాగడం వంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని వారిని ఆదుకోవాలని కోరారు. వారికి రిజర్వేషన్ ఐదు శాతం కల్పించాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే గజపతినగరంలో స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలివద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో రెల్లి ఉప కులాల సంఘ జిల్లా నాయకులు సోము మురళీమోహన్‌తోపాటు గజపతినగరం నియోజకవర్గ ఇన్చార్జ్ గంద్రేటి రామారావు, సెక్రెటరీ దశమంతుల శ్రీను, కార్యనిర్వాహకులు టి.ఈశ్వరరావు మరియు నియోజకవర్గంలోని రెల్లి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం... ఆందోళన వద్దు : జన సైనికులు

విశాలాంధ్ర-భోగాపురం : కష్టం వచ్చిన ప్రతీ ఒక్కరికి " మేమున్నాం ఆందోళన పడవద్దని జనసేన నేతలు భరోసా కల్పిస్తున్నారు. మండలంలో చేపల కంచెరు గ్రామానికి చెందిన పోలా ఎల్లయ్య ఇల్లు కాలిపోయింది. అగ్ని ప్రమాదంలో సమస్తం పోగొట్టుకున్న ఎల్లయ్య కుటుంబానికి జననేతలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి 11 వేల నగదు అలాగే 5వేలు విలువైన నిత్యావసర వస్తువులు అందించి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వందనాలు రమణ, మట్ట అయ్యప్ప రెడ్డి, పడాల శ్రీనువాసరావు, బొల్లు త్రినాథ్, పతివాడ బంగారు రాజు, నడగల లక్ష్మణ్, గుండు దిలీప్, మైలపల్లి నరసింహులు, అరజల్ల నర్సింగ్ రావు, అప్పలకొండ, రాము, ఈశ్వర్, దల్లి శ్రీను, కొయ్య రాంబాబు, షణ్ముఖ, గోవింద్, మణి, లక్ష్మణ్ తదితర 22 పంచాయతీలకు చెందిన జనసేన నాయకులు పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో రక్తదానం చేసిన సహాయస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యుడు

విశాలాంధ్ర-గజపతినగరం : సహాయస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు అత్యవసరమైన సమయంలో రక్తదానం చేసి తన ఉదారతను గజపతినగరంలో చాటుకున్నారు. నెలిమర్ల మారుతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీ కి డెలివరీ కోసం అత్యవసరంగా బి నెగిటివ్ బ్లడ్ గ్రూప్ అవసరమైంది. అయితే వెంటనే వారు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సంస్థను సంప్రదించి అడగగా వారు వారికి రక్తదానం చేయడం జరిగింది. బి నెగిటివ్ రక్తం కలిగి ఉన్న ఫౌండేషన్ సభ్యులు పవన్ వెంటనే బ్లడ్ బ్యాంకుకి వెళ్లి రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక అభినందనలు తెలుపుకున్నామని సంస్థ సహాయ కార్యదర్శి సాయి రేవంత్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామ గణేష్ అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మండలంలోని సతివాడ మోడల్ హైస్కూల్లో బుధవారం సంకల్పం ప్రచార రథంతో పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరగాల్లు అనేక మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు మోసపోకుండా అప్ర మత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత డేటాను గోప్యంగా ఉంచాలని, తెలియని వ్యక్తులు అడిగితే వివరాలు తెలపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. గంజాయి వలన కలిగే దుష్ప్రయోజనాలు, గంజాయి నిర్మూలనకు చేపట్ట వలసిన చర్యలు, నేటి యువతపై గంజాయి డ్రగ్స్ ప్రభావం, ఈ డ్రగ్స్ కుటుంబాలును ఏ విధంగా విచ్ఛిన్నం చేస్తాయి, తదితర అంశాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలతో పాటుగా మిగతా ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి, నలుగురికి గాయాలు

విశాలాంధ్ర - రామభద్రపురం : ఆటో, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక మహిళా మృతి చెందగా నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయని స్థానిక ఎస్సై వెలమల ప్రసాదు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గొల్లలపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సేనపతి రామారావు తన ఆటోలో ప్రయాణికులను తీసుకొని గ్రామం నుంచి వస్తుండగా బొబ్బిలి మండలం మెట్టవలసి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వాండ్రా సు శ్రీను జొన్నల లోడు కని వస్తుండగా గొల్లలపేట సచివాలయం ఎదురుగా రెండు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలి ఆదిలక్ష్మి ప్రమాద స్థలంలోనే మృతిచెందగా, మరో నలుగురు వ్యక్తులైన బాలి పద్మావతి,లెంక సత్యవతి, బాలి వాసవి బాలి రమణమ్మలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన నలుగురు వ్యక్తులను ప్రాథమిక వైద్యం కొరకు బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి ప్రాథమిక వైద్యం జరిపి మరింత మెరుగైన వైద్యం కొరకు విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఆదిలక్ష్మి నీ శవ పంచాంగం జరిపి బంధువులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాలను సీజ్ చేసామని ఆయన అన్నారు.

మృతుడి ఆచూకీ తెలియజేయండి

విశాలాంధ్ర-బొబ్బిలి : రైల్వే స్టేషన్లు రెండోవ ప్లాట్ వద్ద. గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. మృతిపై ప్రభుత్వ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మృతుడి ఆచూకీ ఊరు పేరు తెలియదుని మృతుడు ఆచూకీ తెలిపిన వ్యక్తులు రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బి. ఈశ్వరరావు బొబ్బిలి వారికి 9491813163, 8309901038 తెలియ జేయాలని కోరారు.

కోడి పందాలు ఆడుతున్న 8మంది అరెస్టు

విశాలాంధ్ర-గంట్యాడ : గంట్యాడ మండలం కొర్లాం గ్రామంలో కోడిపందాలు ఆడుతున్న 8 మందిని గంట్యాడ. పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు కోడిపందాలు స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై సాయి కృష్ణ తెలిపారు ఈ దాడుల్లో కోడిపందాలు ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 9 పందెంకోళ్లను 750 రూపాయల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు సహకారం

విశాలాంధ్ర-గంట్యాడ : గంట్యాడ మండలం బుడతనాపల్లి గ్రామంలో చిట్టి చేతులు సహృదయంతో ముందుకు వచ్చి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేయి చేయి కలిపి తల్లిదండ్రుల సహకారం టీచర్ల సహకారంతో విరాళాలు సేకరించి 9795 రూపాయలు లెప్రా సొసైటీ సంస్థకు సోమవారం ప్రధానోపాధ్యాయులు చేత మీదగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ బాధ్యతలు పట్ల విద్యార్థి దశ నుంచి నేర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు లెప్రా సొసైటీ ఫండ్ రైసింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు ఈ నగదు అందజేయడం జరిగినది.

పవన్‌కళ్యాణ్ కుమారుడి ఆరోగ్యం మెరుగుపడాలి

జనసేన నాయకుల పూజలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుమారుడు కొణిదల మార్క్ శంకర్ ఆరోగ్యం మెరుగుపడాలని చీపురుపల్లి నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ విసనగిరి శ్రీనివాసరావు స్థానిక శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోజున సింగపూర్ స్కూల్లో అగ్ని ప్రమాదవశాత్తు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారి అబ్బాయి మార్క్ శంకర్ కాళ్లు చేతులు గాయాలై, పొగ కారణంగా తీవ్ర అస్వస్థకు గురై హాస్పిటల్‌లో చేరిన విషయం తెలిసి యావత్ ఆంధ్ర రాష్ట్రం అంతా తీవ్ర మనోవేదనకు వేదనకు గురయింది అన్నారు. కొణిదల మార్క్ శంకర్ ఆరోగ్యం మెరుగుపడి త్వరగా కోలుకొని మళ్ళీ స్కూల్ బాట పట్టాలని అమ్మవారిని కోటి దండాలతో వేడుకొన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు టిడిపి టౌన్ ప్రెసిడెంట్, కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, కింతలి వాసుదేవరావు, జనసేన శంకర్, మీసాల సూరి నాయుడు, సత్యజి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పెండింగ్ బిల్లులు రూ. 42 కోట్లు

క్షేత్ర సహాయకులతో సమావేశంలో క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమామని

విశాలాంధ్ర-రామభద్రపురం : మండలంలో జనవరి 17 నుంచి ఏప్రిల్ 9వరకు ఉపాధి హామీ పనులకు సంబంధించిన బిల్లులు 42కోట్ల రూపాయల వరకు పెండింగ్లో ఉన్నాయని గజపతి నగరం క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమామణి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. జనవరిలో జరిగిన పల్లె పండుగ పనుల్లో భాగంగా 24కోట్ల రూపాయలు బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, అలాగే 18 కోట్ల రూపాయలు ఉపాధి హామీ వేతనదారులు బిల్లులు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. అలాగే వేసవి సందర్భంగా ఉపాధి హామీదారులు పని ప్రదేశాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీకి సంబంధించిన పనులు ఎండ తీవ్రత వలన రెండు పూటలా పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, ఏపీ ఓ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల తల్లులకు పోషకాహారంపై అవగాహన ఉండాలి

జామిలో పోషకాహార వారోత్సవాలలో ఐసిడిఎస్ సిడిపిఓ ఉమా

విశాలాంధ్ర-జామి: అంగన్‌వాడీ కేంద్రాల పరిదిలో ఉన్న చిన్నారుల తల్లులకు పోషకాహారం అంటే ఏమిటో పూర్తిగా అవగాహన కలిగి వుండాలని ఎస్‌కోట క్లస్టర్ సిడిపివో వి.ఉమా సూచించారు. పోషణ పక్వాడ్‌లో భాగంగా ఈనెల 8వతేదీనుంచి ఈనెల 22వ తేదీ 22 వతేదీ వరకు ఐసిడిఎస్ ఆధ్వనిర్యంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిదిలో పోషకాహార వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మండలంలోని రామయ్యపాలెంలోనూ, జామి వర్రివారి కళ్ళాలు, జామి 6,7,8 అంగన్‌వాడీ కేంద్రాలకు అవగాహనా సదస్సులను జామి సూపర్‌వైజర్ డి. సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారుల, వారి తల్లుల ఆరోగ్యం, తీసుకోవాల్సి పౌష్టికాహారంపై తల్లులకు సిడిపివో అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏఏ ఆహారంలో పోషకాలు ఉంటాయో తెలియజేసారు. అన్ని కేంద్రాలలో ఈపౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని సిడిపివో తెలిపారు. ఈకార్యక్రమంలో భీమసింగి క్లస్టర్ సూపర్‌వైజర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

'కార్యకర్తే అధినేత'లో వినతుల స్వీకరణ

విశాలాంధ్ర-చీపురుపల్లి : కార్యకర్త అధినేత అనే కార్యక్రమం ద్వారా చీపురుపల్లి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి మల్లిక నాయుడు బుధవారం నాడు కార్యకర్తల నుండి పలు వినతులను స్వీకరించారు. స్థానిక శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న తనకు తెలియజేయాలని ఈ సందర్భంగా మల్లిక్ నాయుడు కోరారు. పలు సమస్యల నుండి ప్రజలు ఇచ్చిన వినతులను తీసుకొని పరిష్కారం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రామ మల్లిక్ నాయుడు గారు మాట్లాడుతూ..ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని టిడిపి కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుంది, అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కాము నాయుడు, గవిడి నాగరాజు, పైల బలరాం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం కోసం సీపీఐ పోరుబాట

2వ రోజు నిరసన దీక్షలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలో బాగంగా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి 5లక్షలు హామీ అమలు చేసే వరకు భారత కమ్యునిస్టు పార్టీ (సిపిఐ) పోరుబాట కొనసాగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ తెలిపారు. బుధవారం 2వ రోజు నిరశన దీక్ష కార్యక్రమం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిర్వహించారు ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జగనన్న కాలనీల నిర్మాణం కేవలం 1సెంటు స్థలంలో ఇండ్లు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేసుకోవలన్న షరతులకు బయపడి అధిక వడ్డీలకు అప్పు తెచ్చి ఇంటి నిర్మాణం పూర్తి కాకుండానే ఇండ్లును కోల్పోవలసి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చే 1 లక్ష 80 వేల రూపాయలకి ఇంటి స్థలం, నిర్మాణ వ్యయం సరిపోదని నూటికి తొంబైశాతం ప్రజలు నిర్మాణం చేసుకోలేక పునాదులు వేసుకుని మరల ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారన్నారు. ఇసుక, ఇటుక, ఇనుము, సిమెంటు మొదలైన ఇంటి నిర్మాణ సామాగ్రి వ్యయం అమాంతం పెరగడం ఇంటి నిర్మాణం చేసుకోలేకపోయారు అని అన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం చేసింది. ఇప్పుడు మళ్ళీ కొత్తగా రీసర్వే చేయాలని, ఇల్లు నిర్మాణం చేయని పట్టాలు రద్దు చేయాలి అని నిర్ణయాన్ని సిపిఐ ఖండిస్తుంది అన్నారు. అలాంటి దుర్మార్గమైన నిర్ణయాలు చేయడం వలన చాలామంది లబ్ధిదారులు ఇళ్ళు కోల్పోతారు అని అన్నారు. దినసరి కూలీకి పోయి జీవనం సాగిస్తున్న సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు సొంతంగా ఇంటి నిర్మాణం చేసుకోవాలంటే ఒక జీవిత కాలం సరిపోవడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్న జీవితంలో సొంతింటి కల నెరవేర్చుకోవాలన్న సంకల్పం సాకారం కాక అధికారులు, పాలక ప్రభుత్వాల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నా ఫలితం దక్కడంలేదు అన్నారు. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం పక్కా గృహం మంజూరయ్యి కట్టుకొని లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం పట్టణాల్లో 2 సెంట్లు గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు భారత కమ్యునిస్టు పార్టీ (సిపిఐ) పేదల పక్షాన నిలబడి దశల వారీగా పోరాటాలు చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కస్పా శాఖ కార్యదర్శి ఎస్ రంగరాజు, బలిజివిధి శాఖా కార్యదర్శి పొందూరు అప్పలరాజు, మార్బ్ నగర్ శాఖా సహాయ కార్యదర్శి బూర వాసు, వద్దాది కొండలరావు, శాంతి నగర్ శాఖా నాయకులు సూరీడమ్మ, ఏఐటీయూసీ నాయకులు అల్లి మారయ్య, జలగడుగులా కామేష్ తదితరులు హాజరయ్యారు.

అక్రమ వ్యవసాయ విద్యుత్ వినియోగంపై విజిలెన్స్ దాడులు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో గల పలు గ్రామాలలో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు, ఆపరేషన్ అధికారులు మరియు స్థానిక విద్యుత్ సిబ్బంది సహకారంతో సంయుక్తంగా అక్రమ విద్యుత్ వినియోగదారులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 39 మంది రైతులు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిట్టితల్లి, రమణలు మాట్లాడుతూ ఎంతమంది రైతులకైనా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ అవసరమైన రైతులు అవసరమైన ధ్రువపత్రాల దగ్గర పెట్టుకొని టోల్ ఫ్రీ నెంబర్ 1912కి కాల్ చేసి విద్యుత్ కనక్షన్ కొరకు నమోదు చేసుకోవాలని వీరు సూచించారు. ఇలా అక్రమంగా విద్యుత్తు వినియోగించడంవల్ల అనేక ట్రాన్సార్మర్లు కాలిపోతున్నాయని ఈ విషయాన్ని రైతు గుర్తించాలన్నారు. దీంతో సక్రమంగా విద్యుత్ వినియోగించే రైతులకు సరఫరా అందించలేక పోతున్నామని వీరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అక్రమ వినియోగదారులు మేల్కొని సక్రమ విద్యుత్ సరఫరా సరఫరా తీసుకొని ఎడల మరిన్ని దాడులు నిర్వహించాల్సి వస్తుందని వీరు తెలిపారు.అలాగే వాలంటరీ డిస్కోజర్ స్కీములో భాగంగా గృహ వినియోగదారులకు అడిషనల్ లోడ్ నిమిత్తము 50 శాతం రాయితీ కలదు అన్నారు. ఒక కిలోవాటుకు 2400 గాను 1200 మాత్రమే ఈపీడీసీఎల్ వెబ్సైట్లో చెల్లించి మీ లోడ్ ను క్రమబద్ధీకరించుకొని సువర్ణ అవకాశం సద్వినియోగ పర్చుకోవలసిందిగా కోరారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.చిట్టి తల్లి , బి.వి రమణ అసిస్టెంట్ ఇంజనీర్లు కే. దివాకర్ , వై. సూర్య ప్రభాకర్ , ఎస్ సన్యాసి నాయుడు, రవికుమార్ , విజయ్ కుమార్, విజిలెన్స్ కానిస్టేబుల్ మరియు గర్భం విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు పోరాడుతాం

మనువాదానికి వ్యతిరేకంగా ప్రచారం చేపడతాం డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జె.వి. ప్రభాకర్

విశాలాంధ్ర-విజయనగరం : దేశంలో దళితుల అభివృద్ధికి, సామాజిక, ఆర్థిక, సాధికారతకు ఎంతగానో ఉపయోగపడే భారత రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు యడిహెచ్‌పిఎస్ నిరంతరం పోరాడుతుందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్ అన్నారు. బుధవారం విజయనగరం జిల్లా కార్యవర్గ సమావేశం నిమిత్తం విజయనగరం వచ్చిన ఆయన సమావేశంలో మాట్లాడారు. దేశంలోనూ, రాష్టంలోనూ ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయన్నారు. కానీ పాలకులు మాత్రం దళితుల హక్కులతో రాజకీయాలు చేస్తున్నారని, వారికి రావాల్సిన రుణాలకు నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. దళితుల కోసం కేంద్రం 49 లక్షల కోట్లును మంజూరు చేస్తే వాటిలో 5 లక్షల కోట్లు మధ్యలో కటింగ్‌కు గురవుతోందన్నారు. 2126 కోట్లును బడ్జెట్లట ప్రవేశపెడితే 26వేల కోట్లును కోత విదించారన్నారు. ఎస్సీ, ఎస్టీల సబ్‌ప్లాన్ నిధులకు ఎంత మొత్తంలో నిధులు విడుదల చేసారో వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేసారు. ఇక ఎన్ఎస్ఎఫ్‌డిసి పథకానికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేసారన్నారు. నేడు ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలీలు తగిన గిట్టుబాటు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముందు వారి పొట్ట నింపేలా ప్రభుత్వాలు ఆలోచన చేయాలన్నారు. ఏప్రిల్ నెలలో అనేక విశిష్టతలు ఉన్నాయని ఈనెల 5న జగ్జీవన్‌రామ్, 11న జ్యోతీరావ్‌ఫులే, 14న రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతులు ఉన్నాయని, వాటిని డిహెచ్‌పిఎస్ తరుపున ఘనంగా నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలో మనువాదానికి వ్యతిరేకంగా డిహెచ్‌పిఎస్ ప్రచారం చేపడుతోందని, రాజ్యాంగ దినమైన ఈనెల 14నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. ఈసందర్భంగా డిహెచ్‌పిఎస్‌కు సంభందించిన కరపత్రాలను విడుదల చేసారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మిరమణ, జిల్లా డిహెచ్‌పిఎస్ అధ్యక్షుడు మైలపల్లి ముత్యాలు, ప్రధానకార్యదర్శి రేగేటిసంతోష్, పట్టణ కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వప్రయోజనాలు కన్నా ప్రజా సంక్షేమానికే పవన్ ప్రాధాన్యత

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జానా ప్రసాద్

విశాలాంధ్ర -నెల్లిమర్ల : స్వప్రయోజనాలు కన్నా ప్రజా ప్రయోజనాలకే పవన్ ప్రాధాన్యత ఇస్తారని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, జనసేన పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు జానా ప్రసాద్ అన్నారు. నెల్లిమర్లలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు ప్రమాదానికి గురయ్యాడని తెలిసినా కూడా పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంత పర్యటన వాయిదా వెయ్యలేదన్నారు. ఓ వైపు కుమారుడి పరిస్థితికి బాధపడుతూనే మరోవైపు గిరిజన గ్రామాల్లో స్వయంగా పర్యటించారని చెప్పారు. ఈ సంఘటన ఆయనకు ప్రజలపై ఉన్న మమకారాన్ని చాటిచెబుతోందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ వంటి లీడర్, ప్రజాప్రతినిధి దొరకడం రాష్ట్రం చేసుకున్న అదృష్టమని ప్రసాద్ కొనియాడారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం

- అర్హులందరికీ పింఛన్ మంజూరు
- ఉపాధి వేతన బకాయిలు మొత్తం ఈ నెలలో చెల్లిస్తాం
- రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ., సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- తాగునీటి సరఫరాకు జిల్లాకు కోటి నిధులు కేటాయింపు
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయనగరం : ఈ వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎక్కడా తాగు నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగిందని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ., సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల అభివృద్ధికి, పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందని తెలిపారు. సాగు నీరు, తాగు నీరు సరఫరా చేయడానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తాగునీరు, పింఛన్లు, విద్యుత్, ఉపాధి హామీ, వైద్య ఆరోగ్యం, గృహ నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. ఎన్.టి.ఆర్. బరోసా పింఛన్లు అర్హులైన అందరికీ ఇవ్వాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం పని చేస్తోందని, అయితే మంచం పట్టిన వారికీ, వికలాంగులకు పారదర్శకంగా వెరిఫై చేసి నిజమైన అర్హులకు అందజేయాలనే వెరిఫికేషన్ చేయడం జరుగుతోందన్నారు. మంచం పట్టిన వారి కోసం వైద్య బృందం వారి ఇంటికే వెళ్లి వెరిఫై చేస్తున్నారని, వికలాంగులు సమీప పిహెచ్‌సికు వెళ్ళవలసి ఉంటుందని, 2 వారాల ముందే ఏ తేదీన హాజరు కావాలో నోటీసు జారీ చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే జీవిత భాగస్వామి మరణిస్తే వారి స్పౌస్‌కు పింఛన్ నవంబర్ నుండి అందిస్తున్నామని తెలిపారు. నవంబర్ కన్నా ముందు చనిపోయిన వారికీ కూడా పింఛన్ అందజేయడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ వేతన దారులకు వేతనాల బకాయిలు చెల్లించాలని సభ్యులు కోరిన మేరకు మంత్రి స్పందిస్తూ జనవరి 14 వరకు వేతనాలను చెల్లించడం జరిగిందని, ఈనెల 13, 14 తేదీలలో మిగిలిన బకాయిలు కూడా చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి పనులు పంచాయతీ తీర్మానాలతో జరగడం లేదని, పనుల నాణ్యత తక్కువగా ఉందని సభ్యులు చర్చించగా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ స్పందిస్తూ గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులనే చేపట్టడం జరుగుతుందని, నాణ్యత విషయంలో ఎక్కడైనా జరిగితే ప్రత్యేకంగా తన దృష్టికి తెస్తే స్వయంగా తనిఖీ చేస్తానని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లాలో ఎవ్వరికీ ఏ సమస్య ఎదురైనా మండల స్థాయిలో గానీ, జిల్లా స్థాయిలో గానీ అధికారుల దృష్టికి తేవాలని, పరిష్కరించడానికి అధికార యంత్రాంగం ఎల్లపుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

తాగునీటి సరఫరాకు జిల్లాకు రూ.కోటి నిధులు కేటాయింపు : జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందుగానే అన్నిబోర్ వెల్స్, జలాశయాలు తనిఖీ చేయాలనీ, నీటి మట్టం తగ్గితే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్.డబ్ల్యు.ఎస్ , ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తోటపల్లి, చంపావతి, ఆంధ్రా జలాశయాల క్రింద ఉన్న బోరు బావులను ముందే రీచార్జ్ చేయడానికి తగు అనుమతులను తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. తాగునీటికి తొలి

ప్రాధాన్యత నివ్వాలని, గ్రామ, మండల స్థాయి సిబ్బంది ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. తాగునీటి కోసం ఉమ్మడి జిల్లాలకు కోటి రూపాయల చొప్పున జిల్లా పరిషత్ నుండి నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. వికలాంగ పింఛన్ల వెరిఫికేషన్ కోసం ఏ ఆధారంలేని వికలాంగులు హాజరు కావడానికి కష్టంగా ఉంటుందని, ప్రభుత్వమే సచివాలయ సిబ్బందిని తోడు పంపాలని తెలిపారు. వేసవి దృష్ట్యా పవర్ కట్ లేకుండా చూడాలని, విద్యుత్ భారం పేదవారి మీద పడకుండా ప్రభుత్వం చూడాలని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు మాట్లాడుతూ తాగునీటి సరఫరా కోసం మెటీరియల్ అవసరమైతే ఎం.పి నిధుల నుండి సమకూర్చడం జరుగుతుందని, తాగు నీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. బొబ్బిలి ఎం.ఎల్.ఏ రంగా రావు మాట్లాడుతూ బొబ్బిలి మున్సిపాలిటీ కి తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. బొబ్బిలి పి.హెచ్ సి లో ముగ్గురు వైద్యులకు ఒకే సారి బదిలీ అయ్యిందని, కొత్తవారు వచ్చే వరకు వీరిని కొనసాగేలా చూడాలని కోరారు. ఈ సమావేశం లో మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్సీలు పివివి సూర్యనారాయణ రాజు(సురేష్ బాబు), ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర తూర్పు కాపు చైర్మన్ పాలవలస యశస్విని, జడ్పీ సీఈవో బెహరా వెంకట సత్యనారాయణ, ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పిటిసిలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్వారి యువ మంచ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : పేదల అవసరాన్ని గుర్తించి దానికి అనుగుణంగా వారికి సేవలు అందించినప్పుడే స్వచ్ఛంద సంస్థలకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని రోటరీ పూర్వపు గవర్నర్ ఆర్.కె. జైన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తోష్నివాల్ కళ్యాణ మండపంలో మార్వారి యువ మంచ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్కే జైన్ నూతన కార్యవర్గ ప్రతినిధులచే ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్వారి యువ మంచ్ కు చెందిన యువత సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ 2025 సంవత్సరం కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం హర్షణీయమన్నారు. ఈ ప్రణాళికలో మూగజీవాలైన పక్షులు, కుక్కలు, గోవులకు పట్టణంలోని వివిధ ప్రాంతాలలో త్రాగునీరు ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచేందుకు నిర్ణయించడం అభినందనీయమన్నారు. వేసవిలో చలివేంద్రాలు, జాతీయ పండుగలు అయిన స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవం వంటివి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందించడం గొప్ప విషయం అన్నారు. మార్వారి యువ మంచ్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన అభిషేక్ శర్మ, కార్యదర్శి అటల్ దంద్, కోశాధికారి అర్పితిజైన్, ప్రతినిధులు అశోక్ పురోహితు, రోహిత్ సోనీ, సంజీవ్ అగర్వాల్, తరుణ్ జవహర్ , భరత్ కొఠారి, కమల్ శర్మ, జోన్ 4 ఉపాధ్యక్షులు అభిషేక్ చౌదరి, జాయింట్ సెక్రెటరీ ఉమేష్ అగర్వాల్ తదితరులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు మేఘరాజ్ రాఠి, వివి రాజేష్, ఆర్. శంకర్ రెడ్డి, ప్రవీణ్ అంచాలియ, నిర్మల్ జైన్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన మార్వారి సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాటకు సిద్ధం

సిఐటియు ఆధ్వర్యంలో ఎంపీడిఓకు వినతి

విశాలాంధ్ర-కొత్తవలస : గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని.. లేకుంటే సమ్మె బాట పడతామని తెలియజేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కొత్తవలస మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం స్థానిక ఎంపీడిఓ పి.రమణయ్య, ఏపీవో జనార్ధన్ రావు లకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా నాయకులు గాడి అప్పారావులు మాట్లాడుతూ 2005 నుంచి నేటివరకు అటుప్రభుత్వానికి...ఇటు ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ అనేక సేవలందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ ల శ్రమను 19ఏళ్లుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కారు చౌకగా దోచుకుంటున్నాయన్నారు. రోజు రోజుకీ మార్కెట్లో ధరలు పెరుగుతున్నా.. మరో పక్క ప్రభుత్వాలు మారుతున్నా... వీళ్ళ బ్రతుకుల్లో మాత్రం మార్పు లేకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కనీసవేతనం రూ.26,000 ఇవ్వాలని, మ్యాన్ డేస్ విధానాన్ని రద్దు చేయాలని,హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని, అందరికీ ఎఫ్.టి.ఈ అమలుచేసి ఉద్యోగభద్రత కల్పించాలని, ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ రద్దుచేయాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పైన తెలిపిన సమస్యలను ఈరోజునుంచి 15రోజుల్లోగా పరిష్కరించకపోతే 16వరోజు నుంచి సమ్మెబాటపడతామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు సిహెచ్.సీతారామస్వామి, డి.శ్రీను, ఎం.నూకరాజు, బి.కనకమహాలక్ష్మి, శేఖర్, నూకరాజు, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడలో పౌష్టికాహార పక్షోత్సవం

విశాలాంధ్ర-డెంకాడ : మండలంలోని డెంకాడ గ్రామంలో బుధవారం భోగాపురం ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 8 నుండి 22 వరకు నిర్వహిస్తామని దానిలో భాగంగా బుధవారం డెంకాడలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిడిపిఓ ఏ.సత్యవతి తెలిపారు. ఈ సందర్భంగా డెంకాడ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె దీని ముఖ్య ఉద్దేశం 1000 రోజుల్లో స్త్రీలు గర్భం ధరించిన మొదలు బిడ్డకు రెండు సంవత్సరాల వయసు వరకు వాటి ప్రాముఖ్యతను వివరించారు అంగన్వాడీ కేంద్రంలో పోషణ ట్రాకర్ యాప్‌లో లబ్దిదారులు తమంతట తాము నమోదు చేసుకోవాలని తెలిపారు బరువు తక్కువ పిల్లలను గుర్తించి వారి సంరక్షణ బాధ్యత గురించి తల్లులకు వివరించారు పిల్లల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి ఆహారపు పద్ధతులు అలవాట్లను చేసుకొనేలా తల్లులు అంగన్వాడి కార్యకర్తలు కు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఏ. సత్యవతి శైలజరాణి అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీ సత్యవతి ఆయాలు ఏఎన్ఎంలు ట్రైనింగ్ పిల్లలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలి : లొగిశ రామక్రిష్ణ డిమాండ్

విశాలాంధ్ర-గుర్ల : మాలలకు అన్ని రంగాల్లో నష్టం కలిగించే ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గుర్ల మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని, మాలలకు రిజర్వేషన్ల శాతం పెంచాలని, ఎట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ ధర్నా ని ఉద్దేశించి లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మాలల శాతాన్ని కుదించి వారిని నష్టపరచాలని రాజకీయ పార్టీలు అన్ని ఏకమై వర్గీకరణ అంశాన్ని అమలు జరపాలని కుట్రపన్నారు అన్నారు.రాష్ట్ర ఎస్సీ జనాభాలో అత్యధికంగా ఉన్న మాలలకు దీని వల్ల తీవ్ర నష్టం ఏర్పడుతుంది అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వెంటనే వర్గీకరణ అంశాన్ని వెంటనే రద్దు చేయాలని మాల కులస్థులు కోరుతున్నారు అన్నారు. అనంతరం ఇంచార్జీ తహసీల్దార్ వి.నారాయణమ్మని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు మండల ఉపాధ్యక్షుడు చందక నూకరాజు,జిల్లా మహిళా అధ్యక్షురాలు చోళ్ల రాజకుమారి, కార్యదర్శి కోరాడ సత్యనారాయణ,జిల్లా కార్యదర్శులు పాంద్రంకి మురళీ, బదారి సూర్యనారాయణ,గుర్ల మండల అధ్యక్షుడు లోగిశ లక్ష్మణరావు, గరివిడి మండల అధ్యక్షుడు అక్కివరపు రాజు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ లోగిశ సురేష్, మండల నాయకులు లొగిశ రమణ, పెందుర్తి పైడిరాజు, లోగిశ ప్రసాద్, డోల బంగార్రాజు, దాసరి సతీష్, లోగిశ బంగార్రాజు, లోగిశ సంతోష్, నాగరాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం : కొత్తవలస ఏడిఏ విజయ

విశాలాంధ్ర-లక్కవరపుకోట: ప్రకృతి వ్యవసాయంతో భూసారమని కొత్తవలస ప్రాంతీయ వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ అన్నారు. బుధవారం మండలంలోని చందులూరు రైతు సేవా కేంద్రం నందు నువ్వుల్లో పి. ఎం. డి. ఎస్ కొరకు విత్తనాలను సిద్ధం చేయడం జరిగిందని ఆమె తెలిపారు. రైతులు తలకరిలో వేసే నువ్వుల పంటలతో పాటు ప్రకృతి వ్యవసాయం ద్వారా పి. ఎం. డి. ఎస్ కిట్టును ఏడు రకాలు విత్తనాలతో సిద్ధం చేయడం జరిగిందని ఒక కిట్టు ధర ?100 అని చొప్పున రైతు సేవ కేంద్రం ద్వారా అమ్మడం జరుగుతుందని ప్రతి రైతు నువ్వులు వేయడం వల్ల నువ్వు పంటతో పాటు ఇతర పంటల ద్వారా కూడా రైతు ఆదాయం పొందడంతో పాటు భూమి గుల్ల భారీ భూసారం పెరుగుతుందని తెలియజేయడం జరిగిందన్నారు. లింగంపేట యూనిట్కు 820 ఎకరాలకు, చందులూర యూనిట్కు 1100 ఎకరాలకు పి.ఎం.డి.ఎస్ ఇలా తయారుచేయడం జరిగిందని రైతులందరూ కూడా ఈ సదావకాశాన్ని వినియోగించుకొని ప్రకృతి వ్యవసాయంలో వ్యవసాయ సాగు చేయాలని ఆమె తెలిపారు. అదేవిధంగా వారికి వేసే నవధాన్యాలు కిట్టు 18 రకాల విత్తనాలు 12 కేజీల కిట్టు 800 రూపాయలు చొప్పున అమ్మడం జరుగుతుందని అన్నారు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్వాతి, వి. ఎ. ఎ లు సురేష్, మోహన్, తేజ, అప్పారావు, శివరామరాజు, రేణుక, ఎన్. ఎఫ్. ఏ వరప్రసాద్, రమేష్, ఇతర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు



విశాలాంధ్ర-డెంకాడ: భద్రత కారణాలు దృష్ట్యా డెంకాడ మండలంలోని పినతాడివాడ గ్రామంలోని రామ మందిరం లో 2 సీసీ కెమెరాలు మరియు గెద్దవానిపాలెం ముత్యాలమ్మ తల్లి గుడికి 2 సీసీ కెమెరాలు డి తాళ్లవలస గ్రామంలోని బంగారం తల్లి ఆలయంలో 2 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు డెంకాడ ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలను జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబైలైజేషన్ అధికారి సందర్శన

విశాలాంధ్ర-భోగాపురం : జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబైలైజేషన్ ఆఫీసర్ వి.ఆదినారాయణ భోగాపురం ఆదర్శ పాఠశాలను బుధవారం సందర్శించారు. 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర' స్టూడెంట్ కిట్స్ ఏవిధంగా భద్ర పరుస్తున్నారని విద్యాశాఖాధికారి ఎం.రమణమూర్తిని అడిగి తెలుసు కున్నారు. ఈనెల 15 నుండి స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్‌కి పంపుతామని తెలిపారు. ఈ కిట్స్ పాఠశాలలకు చేరేంతవరకు మండలానికి సంబంధించిన మానిటరింగ్ టీం సభ్యులు, కో-ఆర్డినేట్ స్టాఫ్ సభ్యులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరానికి కూడా 1వ తరగతి నుండి 12వ తరగతి చదువుచున్న విద్యార్థులు అందరికి ఈ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్స్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సి. పార్వతి, కో -ఆర్డినేటర్ డి.సూర్య నారాయణ సీఆర్పీలు ముద్దన విజయ భాస్కర రావు, మాత శేషు బాబు పాల్గొన్నారు.

ఘనంగా చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి వేడుక

విశాలాంధ్ర-నెల్లిమర్ల : కమ్యూనిస్టు పార్టీ దిగ్గజం దేశవ్యాప్తంగా భూపోరాటాలకు శ్రీకారం చుట్టి నిరుపేదలకు జీవనాధారం కల్పించిన చంద్ర రాజేశ్వరరావు సిరిస్మరణీయుని సిపిఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. బుధవారం కొండ గుంపాం గ్రామంలో చంద్ర రాజేశ్వరరావు 31 వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ దేశంలో భూ సంస్కరణల చట్టాలు ఆయన పోరాట ఫలితంగానే చేయబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలిపల్లి సూరి ఎడ్ల పైడినాయుడు పాల్గొన్నారు తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులందరికీ ఆహ్వానం : కిల్లంపల్లి ఆచారి

విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్ : ఎన్నికల కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ డాక్టర్ గురజాడ ఆనంద్ అధ్యక్షతన ఈ నెల 13 న తాడేపల్లిగూడెం ఉషా గ్రాండ్ హోటల్లో రాష్ట్రస్థాయిలో విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం జరుగుతుందని విజయనగరం జిల్లా అధ్యక్షులు కిల్లంపల్లి ఆచారి అన్నారు. ఈ సమావేశానికి సంఘం పెద్దలు, మండల నాయకులు జిల్లా సంఘం నాయకులు వివిధ ప్రముఖులు అందరిని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కావున అందరూ హాజరై అజెండాలోని అంశాలపై తగు సలహాలు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ఆహ్వాన కమిటీ కోరుతున్నారని అన్నారు. అందువలన విజయనగరం జిల్లా నుంచి మండల నాయకులు, జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు, సంఘం శ్రేయస్సు కోసం కోరుకునే నాయకులు అందరూ హాజరై ఎన్నికల నిర్వహణకు తగు సలహాలు ఇవ్వాలని కోరారు.

డ్వాక్రా రుణాలను కాజేసిన వీఓఏలు

నెలలు గడుస్తున్నా తేలని పంచాయతీ

దాదాపు రూ.7లక్షల వరకు అవకతవకలు జరిగాయంటున్న అధికారులు

విశాలాంధ్ర-జామి: మండలంలోని జాగరం గ్రామంలో వివోల చేతి వాటం డ్వాక్రా మహిళల ప్రాణాలమీదకు వచ్చింది. గ్రామంలో ఎంతో నమ్మకంగా ఇద్దరు వివోఎలు పనిచేస్తుండడంతో వారు అడిగిన సమయంలో తీర్మాణం పుస్తకాలపై సభ్యులు సంతకాలు చేసేవారు. తీర్మాణాలు తరువాత రాస్తామని, ముందుగా సంతకాలు పెట్టమన్నా పెట్టేవారు. ఇదే వివోఎల పాలిట వరంగా మారింది. తీర్మాణాలును తమకు ఇష్టం వచ్చిన విదంగా రాసుకునేవారు. ఈనేపధ్యంలో జాగరం గ్రామంలో పలు సంఘాల నుంచి దాదాపు రూ.7లక్షల వరకు రుణాలను సభ్యులకు తెలియకుండా వివోఎలు తీసుకున్నారని నిర్ధారణ జరిగింది. ఈవిషయాన్ని వెలుగు అధికారులు గుట్టుగా దాచినా చివరికి బట్టబయలు అయింది. అంతేకాకుండా చివరకు వారి మెడకు చుట్టుకునే పరిస్థితి ఏర్పడింది. గ్రామానికి ఇద్దరు వివోఎలను అధికారులు నియమించారు. ఒక వివో లక్షల రూపాయలను సభ్యులను ఏమార్చి తీసుకోగా, మరో వివోఎ మాత్రం తీర్మాణాలను మార్చి, ఫోర్జరీ రికార్డులను తయారు చేసి డబ్బులను కాజేసారు.

రాష్ట్ర స్థాయికి చేరిన పంచాయతీ.. జాగరంలో రుణాలను కాజేసిన వ్యవహారం రాష్ట్ర స్థాయిలో అధికారులకు ఫిర్యాదు వెళ్ళింది. ఈమేరకు కొద్ది నెలల క్రితం జిల్లా స్థాయిలో అధికారులు విచారణకు వచ్చారు. అనంతరం విచారణ ఏమైందో ఎవరికీ అర్ధంకాని పరిస్థితి నెలకొంది. నవంబర్ నెలలో ఒక సిసి నుంచి మరో సిసికి రికార్డులు అప్పగింతతో ఈవ్యవహారం వెలుగులోకి వచ్చింది. అప్పటినుంచి వెలుగు అధికారులు పట్టించు కోకుండా వివోలతో పంచాయతీలను నిర్వహించారు. చివరకు ఒక వివోఎ ఈవిచారణ అనంతరం స్థానిక ఎపిఎంతోపాటు ఇద్దరు సిసిలపైనా ఎస్టీఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం జరిగింది.

మంత్రిగారూ.. భీమసింగికి ప్రత్యామ్నాయం ఎప్పుడు..?

హామీలతో కాలయాపన.. నిరుద్యోగులలో ఆశలు బకాయిల చెల్లింపు కోసం కార్మికుల అవస్థలు

విశాలాంధ్ర-జామి: ఒకప్పుడు వెలుగు వెలిగిన భీమసింగి శ్రీ విజయరామ సహకార చక్కెర కర్మాగారం పరిస్థితి నేడు కనుమరుగవు తోంది. కర్మాగారాన్ని నడపలేమని గత వైసీపీ ప్రభుత్వం మూసివేయగా, ప్రస్తుత కూటమి సర్కార్ సైతం ఇదే వాఖ్యలు చేసింది. అయితే భీమసింగి చక్కెర కర్మాగారం స్థానంలో ప్రత్యామ్నాయంగా మరో కంపెనీ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర సెర్ప్, ఎంఎస్ఎంఇ, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అనేక సందర్భాలలో హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు కొత్త కంపెనీ ఏర్పాటుపై ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా మండలంలోని మొకాసా కొత్తవలస, కుమరాం,అట్టాడ, భీమసింగి, అన్నంరాజుపేట, రామయ్యపాలెం లొట్లపల్లి, అలమండ తదితర గ్రామాలనుంచి అధికంగా వలసు ఉన్నాయి. ఆయా ప్రాంతాల వారు నిత్యం విశాఖకు వివిద పనుల నిమిత్తం వెళ్ళుంటారు. కంపెనీ వస్తే తమ వలసలు ఆగుతాయని వీరంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు తమ బకాయిలకోసం కార్మికులు, ఉద్యోగులు అధికారుల చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతున్నారు. కొత్త కంపెనీ వస్తే తమ బకాయిలను పూర్తిగా చెల్లిస్తారనే ఆశతో వీరంతా ఉన్నారు. కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నా నేటి వరకు భీమసింగిపై కనీస ప్రకటన చేయకపోవడంతో అందరిలో ఆందోళన నెలకొంది. వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాలని, ప్రత్యామ్నాయ కంపెనీని ప్రకటించాలని కోరుతున్నారు.

నవధాన్యాలు సాగు నేలతల్లికి బాగు

ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు

విశాలాంధ్ర-వేపాడ : నవధాన్యాల సాగుతో నేలతల్లి బాగుంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం ఆనందరావు అన్నారు. బుధవారం మండలంలోని కే.జీ పూడి,పాటూరు యూనిట్ నవధాన్యాలు సాగు చేయడానికి అవసరమైన కిట్స్ స్థానిక సి.ఎస్.ఏ కార్యాలయం నందు పాటూరు యూనిట్ కు సంబంధించి సోంపురం రైతు సేవా కేంద్రం నందు నవధాన్యాల కిట్లు డిపిఎం సమక్షంలో సిద్దం చేశారు.ఈ సందర్భంగా డిపిఎం మాట్లాడుతూ రైతులందరూ నవధాన్యాలు సాగు చేయాలని నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి గుల్లభారి భూమిలో పోషకాలు పెరిగి పంటకి అవసరమైనప్పుడు తేమను అందించడం,సూక్ష్మ స్థూల అందిస్తాయిని తెలియజేశారు. రైతులు వరి సాగుకు ముందు 12 కేజీలు నవధాన్యాలను ఒక ఎకరాకు వేసి వరి నాట్లు వేసే ముందు కలియ దున్నిట్లయితే రైతు రూ.2వేల నుండి రూ.3వేలు ఆదా చేసుకోవచ్చని ఎటువంటి ఎరువులు పురుగు మందులు వేయకున్న వరి పంటని పండించవచ్చని రైతులకు సూచించారు. అలాగే రైతులకు అవసరమైన నవధాన్యాలు కిట్లు రైతు సురక్ష కేంద్రం ద్వారా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందించడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతు నవధాన్యాలు వేసి భూమి సారం పెంచుకోవాలని,భవిష్యత్తు తరాలకు మంచి భూమి ఇవ్వడం పర్యావరణ కూడా మేలు జరుగుతుందని కనుక రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి ఎరువులు పురుగుమందులకు దూరంగా ఉండాలని ఆయన సూచనలు సలహాలు అందించారు. విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే ప్రకృతి వ్యవసాయం చెయ్యడంలో ఒక ఉన్నత స్థానంలో ఉందని దీని రైతులందరూ కూడా నిలబెట్టాలని రైతులు వ్యవసాయ సాగుకు అయ్యే ఖర్చు తగ్గించుకొని ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే పంటలు తినడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారని ఆయన ఆశా భావాం వ్యక్తం చేశారు. అలాగే ఆకుల సీతంపేట,వీలుపర్తీ,కరకవలస, కుమ్మపల్లి యూనిట్స్ లో తయారు చేసిన పి.ఎం.డి.ఎస్ కిట్స్ పర్యవేక్షణ చేశారు.ఈ కార్యక్రమంలో సుస్థిర సేంద్రియ వ్యవసాయ కేంద్రం వెంకటరావు, ఎన్ ఎఫ్ ఏ వరప్రసాద్ శంకర్,అధిక సంఖ్యలో రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుశాఖలో కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసుశాఖలో ఆర్మడ్ రిజర్వు విభాగం, పోలీసు స్టేషన్లలో పనిచేస్తూ ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన నలుగురు పోలీసు కుటుంబాలకు కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులును జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - విధి నిర్వహణలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన పోలీసు కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, వారి కుటుంబంలోని వ్యక్తులకు కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేసామన్నారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన బి.తరుణ్ కుమార్, కే.కోమలత, బి.స్వామినాథ్, సిహెచ్.సాయి రెడ్డిలను జిల్లా ఎస్పీ అభినందించారు. పోలీసుశాఖలో నీతి నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేయాలని, పోలీసు వ్యవస్థకు మంచి పేరును తీసుకొని రావాలన్నారు. విధుల్లో తక్షణమే జాయిన్ అవ్వాలని, సీనియర్స్ నుండి నిర్వర్తించాల్సిన విధుల గురించి తెలుసుకోవాలని సూచించారు. జిల్లా పోలీసుశాఖలో ఆర్మ్ డ్ రిజర్వు విభాగంలో పనిచేసిన (1) బి.వెంకటరావు, ఎఆర్యాఎస్ఐ (2) కే.అప్పల నాయుడు, ఎఆర్ హెచ్సి, సివిల్ విభాగంలో పని చేసిన (3) బి.కుమారస్వామి, ఎఎస్ఐ (4) సి.హెచ్.చంద్ర శేఖర్, హెచ్సీ అనే నలుగురు పోలీసు ఉద్యోగులు వివిధ అనారోగ్య కారణాలతో ఇటీవల కాలంలో మరణించారన్నారు. పోలీసు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, వారి కుటుంబాల్లో ఒక్కొక్కరికి, జిల్లా పోలీసుశాఖలో ఏర్పడిన ఖాళీలను అనుసరించి, వారి విద్యార్హతలను పరిశీలించి, ఉద్యోగ నియామక ఉత్తర్వులను జారీ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, డిపిఒ ఎఓ పి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి జూనియర్ సహాయకులు చాముండేశ్వరి, పోలీసు కుటుంబమంది సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరించండి

జెడ్పీ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు

విశాలాంధ్ర- నెల్లిమర్ల : ప్రస్తుత వేసవిలో జిల్లావ్యాప్తంగా విద్యుత్, తాగునీరు, సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్యనారాయణ రాజు(సురేష్ బాబు) కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన జెడ్పీ సమావేశంలో ఆయన తాగునీరు, విద్యుత్ సమస్యలపై మాట్లాడారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అలాగే విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ రెండు విషయాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని సురేష్‌బాబు కోరారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రాకు ఆరు గ్రామాలు ఎంపిక : ఎంపీడీఓ సిహెచ్.సూర్యనారాయణ

విశాలాంధ్ర-వేపాడ : మండలంలో నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మండలంలోని 6 మోడల్ పంచాయతీలు అనగా చినగుడిపాల, వేపాడ, వల్లంపూడి, పాటూరు, ఓబులయ్య పాలెం, ముకుందపురం గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని ఎంపీడీఓసిహెచ్. సూర్యనారాయణ అన్నారు.మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులతో కన్వర్జేన్స్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని గ్రామస్తులకు అవగాహన కల్పించాలని. బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేయకూడదని, గ్రామంలో అవసరమైన చోట సోక్ పిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుండి ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ వస్తున్నాయి కాబట్టి ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి 90 శాతం ప్రజలు పాజిటివ్ గా అభిప్రాయం చెప్పేటట్టు చైతన్య పరచాలన్నారు. గ్రామ స్థాయిలో ఉన్న సచివాలయం సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది,ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ వర్కర్, వెలుగు విఓఏ, ప్రజా ప్రతినిధులు, అందరితో ఒక సమావేశం ఏర్పాటు చేసి గార్బేజ్ కలెక్షన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఈఓ పీఆర్డి రవికుమార్,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దేవి, ఏపిఎం సూర్యనారాయణ, ఏపీఓ ఆదిలక్ష్మి, అంగన్వాడి సూపర్వైజర్ కామేశ్వరి, సిహెచ్ఓ ఆంజనేయులు, ఎంపీహెచ్ఓ, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ జి.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎంఎల్ సిఓ రేవంత్ పాల్గొన్నారు.

ప్రతీ నియోజకవర్గానికి విజన్ ప్లాన్

కలెక్టర్లు డాక్టర్ బిఆర్ అంబేద్కర్, శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర-విజయనగరం : భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతీ నియోజకవర్గానికి విజన్ ప్లాన్ రూపొందించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. స్వర్ణాంధ్ర-2047 కెపాసిటీ బిల్డింగ్ పై విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు రెండు రోజుల వర్క్షాప్ బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రారంభమయ్యింది. ఈ వర్క్షాప్కు హాజరైన కలెక్టర్లు అంబేద్కర్, శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు సంబంధించి డ్రాఫ్ట్ ప్లాన్ను రూపొందించడం జరిగిందని, అలాగే నియోజకవర్గాలకు కూడా ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, నియోజకవర్గ ఎంఎల్ఏల సలహాలను కూడా పరిగణనలోకి తీసుకొని ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాల భౌగోళిక పరిస్థితిని బట్టి వ్యవసాయ, అనుబంధ రంగాల్లోనే ప్రగతికి ఎక్కువగా అవకాశం ఉంటుందని అన్నారు. విజయనగరం జిల్లాలో సుమారు 6,500కు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని, వీటిని అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామికంగా కూడా అభివృద్ధికి అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ అంబేద్కర్ చెప్పారు. భోగాపురం విమానాశ్రయం పూర్తి అయితే పారిశ్రామిక, సేవా రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని అన్నారు. విజన్ 2047 డాక్యుమెంట్ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, అన్ని నియోజకవర్గాలకు ఒకే ప్రణాళిక పనిచేయదని, అక్కడి క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రాథమిక రంగంలో ఉద్యాన పంటలు సాగును విస్తరించడం, పశు సంపదను వృద్ధి చేయడం తదితర చర్యలను సూచించారు. పండ్లు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ వర్క్షాప్ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ బుధవారం ఉదయం ప్రారంభించారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా సమగ్రంగా అధ్యయనం చేసి, నిర్ణీత గడువులోగా నియోజకవర్గాలకు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ముఖ్య ఆర్థిక సూచికల ద్వారా, డేటాను సమీకరించడం, దానిని విశ్లేషించడం, ప్రణాళికలను రూపొందించడంపై శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్షాప్లో ప్రణాళికాశాఖ విశ్రాంత డైరెక్టర్, సలహాదారు సీతాపతిరావు, మూడు జిల్లాలో ముఖ్య ప్రణాళికాధికారులు పి.బాలాజీ, వీర్రాజు, లక్ష్మీప్రసన్న, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, పర్యవేక్షణా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఇమ్యూనిటీ పవర్ పెంపుదలతో వ్యాధులు దూరం

-త్వరలో మన దేశంలో కూడా ఇమ్యునో థెరపీ డ్రగ్స్
-వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్

విశాలాంధ్ర-నెల్లిమర్ల : ఇమ్యునో థెరపీ డ్రగ్స్ తో శరీరం ఏ వ్యాధికి గురైనా దానిని అదుపు చేయడానికి అవకాశం ఉంటుందని వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ అన్నారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో %-%ఇంటిగ్రేటెడ్ మెడికల్ స్కిల్స్%-% అనే వర్క్ షాపు ను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న నాగేశ్వర్ మాట్లాడుతూ రానున్న కాలంలో వివిధ రకాల వ్యాధులకు మాత్రలు, ఇంజెక్షన్లు బదులుగా ఇమ్యూనో థెరపీ డ్రగ్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇతర దేశాలలో ఆవిధానం ఇప్పటికే కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగా అనేక వ్యాధులను నియంత్రించాలంటే ఇమ్యూనో థెరపీ డ్రగ్స్ చికిత్స కీలక పాత్ర పోషించనుందన్నారు. వ్యాధుల నియంత్రణకు యాంటిజన్, యాంటిబాడీల ప్రతి చర్యలపై ఆధారపడి ఉంటుందన్నారు. అందువల్లనే కోవిడ్ సమయంలో యాంటిబాడీ కణాలు ఎక్కువగా చనిపోవడం వల్ల రోగనిరోధకశక్తి తగ్గి ఎక్కువ మంది మృత్యువాతపడ్డారని పేర్కొన్నారు. అప్పటినుంచి ఇమ్యూనాలజీకి ప్రాధాన్యత పెరిగిందని వివరించారు. అంతేగాకుండా మన దేశంలో వివిధ రకాల అలెర్జీలతో బాధపడుతున్న వారి సంఖ్య 35 శాతం ఉందన్నారు. కాగా, వాటికి చికిత్సనందించే వైద్యులు మాత్రం దేశ వ్యాప్తంగా కేవలం 800 మంది మాత్రమే ఉన్నారని వివరించారు. త్వరలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం, వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ సంయుక్తంగా మెడికల్ స్పెషలిస్ట్ అసిస్టెంట్ ప్రోగ్రామ్ అనే కొత్త కోర్సును నిర్వహించనున్నట్టు తెలిపారు. వీటిలో ఉద్యోగావకాశాలు అత్యధికంగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శాంతమ్మ, రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, డాక్టర్ చైతన్య, ఫొరెన్సి క్,అనస్థీషియా విద్యార్థులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల సంరక్షణతో బిడ్డకు నిండు నూరేళ్ల ఆరోగ్యం

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్: గత నెల 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరుగుతున్న పోషన్ పక్వాడా కార్యక్రమాలలో భాగంగా బుధవారం వెయ్యి రోజుల సంరక్షణ మరియు గృహ సందర్శనలు కార్యక్రమాన్ని ఐసి డీ ఎస్ సూపర్వైజర్ అనురాధ ఆధ్వర్యంలో సిటీ గుడి అంగన్వాడీ కేంద్రంలో తల్లుల సమావేశాన్ని నిర్వహించారు. ఒక మహిళ గర్భం దాల్చినాప్పటి నుంచి బిడ్డ పుట్టి, బిడ్డకు రెండు సంవత్సరాల వచ్చే వరకు మంచి ఆహారము మంచి ఆరోగ్య పద్ధతులు పాటించడం, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు త్రాగించడం సకాలంలో బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం మరలా బిడ్డకు ఏడవ నెల వచ్చిన దగ్గరనుంచి తల్లిపాలను కొనసాగిస్తూ అనుబంధ పోషకాహారాన్ని అందిస్తూ రెండు సంవత్సరాల వరకు రావలసిన మైలురాళ్లన్నీ బిడ్డ సకాలంలో అభివృద్ధి చెందినట్లయితే ఇక బిడ్డ భవిష్యత్తులో కుటుంబానికి సమాజానికి మంచి పౌరునిగా నిలబెడతాడని అన్నారు. ఈ కాలాన్ని 1000 రోజులు సంరక్షణ అని తెలియజేశారు. గర్భిణీ స్త్రీ గృహాన్ని సందర్శించి ఆమె సకాలంలో తీసుకోవాల్సిన ఆహారం గురించి జీవన విధానం గురించి తెలియజేశారు. అదేవిధంగా ఏడవ నెల నుంచి బిడ్డ తీసుకోవాల్సిన అదనపు ఆహారాన్ని గూర్చి ఆరు నెలలు నిండిన బాలింత గృహాన్ని సందర్శించి అనుబంధ పోషకాహారాన్ని గురించి వివరించడం జరిగింది. ఈ సంవత్సరం పోషణ అభియాన్ పోషణ పక్వాడా కార్యక్రమంలో నాలుగు థీమ్స్ కలిగి ఉన్నాయి. వెయ్యి రోజుల సంరక్షణపై శ్రద్ధ వహించుట, లబ్ధిదారులు తమంతట తామే పోషణ ట్రాక్టర్ లో నమోదు చేసుకున్న విధానం పట్ల ప్రచారం చేయుట . కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం అమలు చేయడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం నివారించుట, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి,ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా చేయడం. ఈ కార్యక్రమంలో తల్లులు, కార్యకర్తలు లక్ష్మీ ,ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-సంతకవిటి/రాజాం : సంతకవిటి మండలం మామిడిపల్లి పంచాయతీ లో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జ్ పాత్రుని వెంకటరమణ పొదుపు సంఘంలో ఉండే సభ్యులు చేత ప్రకృతి వ్యవసాయం చేయించడానికి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఖరీఫ్ సీజన్ కు ముందు రైతులు నవధాన్యాలు సాగు చేయడం వలన నేల సారవంతం అవుతుంది రసాయనికి వ్యవసాయాన్ని వదిలి ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని ప్రపంచ దేశాలన్నీ ప్రకృతి వ్యవసాయం చేసే ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని ఆహారమే ఔషధము తమకున్న విస్తీర్ణంలో కొంత భాగాన్ని పూర్తిగా రసాయనకి ఇరువులు పురుగుమందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన నవధాన్యాలు సాగు ధన జీవమృతం ద్రవ జీవమృతం కషాయాల ద్వారా పంటలు సాగు చేయవచ్చు ఏకపంట విధానం కాకుండా పలుపంటలు పండించడం వల్ల రైతుకు అదనపు ఆదాయం వస్తుందని భూమిలేని నిరుపేదలు కిచెన్ గార్డెన్ వేసుకుంటే ఆరోగ్యకరమైన ఆహారం తినొచ్చని సంఘ సభ్యులందరికీ తెలియపరచడం జరిగింది ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ అన్నమ నాయుడు, రమ్య, కన్నయ్య, ఐసిఆర్పి లు పాల్గొన్నారు.

గర్భిణీలకు భోజనం సంతోషదాయకం

డాక్టర్ అజిత్ బాబు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలములో ప్రతినెల 9వ తేదీన స్థానిక పీహెచ్సీలకి ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా వస్తున్న గర్భిణీలకు, సహాయకులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందదాయకమని,పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ అజిత్ బాబు అన్నారు. బుధవారం గర్భిణీలకు తనిఖీ అనంతరం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. బాడాం గ్రామంనికి చెందిన శ్రీ సత్య సాయి ట్రస్ట్ 100 మందికి పైగా గర్భిణీలకు భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ అజిత్బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాడాం గ్రామ శ్రీసత్య సాయి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పీవీజీ, గురజాడ స్ఫూర్తి ప్రదాతలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : డాక్టర్ పి వి జి రాజు, గురజాడ అప్పారావులు స్ఫూర్తి ప్రదాతలు అని విజయనగరం ఫోర్ట్ క్యాంపస్లో గల స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి ఎస్ ఎన్ రాజు పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్ష కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, డాక్టర్ జక్కు రామకృష్ణల ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలను ఆయన పరిశీలించారు. ఈ నెల 18వ తేదీన ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమితి ఆధ్వర్యంలో డాక్టర్ పి వి జి రాజు, గురజాడ అప్పారావుల జీవిత విశేషాలపై తమ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించడం సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి ఉపాధ్యక్షులు కాగుపాటి నారాయణమూర్తి, సలహాదారు సుభద్రా దేవి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె ఎస్ ఎన్ మూర్తి, కె.హరికృష్ణ ప్రసాద్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో విజిలెన్స్ దర్యాప్తు

విశాలాంధ్ర-బొబ్బిలి : స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలుకు అవసరమైన కంప్యూటర్లు వివిధ పరికరాలు సుందరీకరణ పనుల్లో అవినీతి జరిగినట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఆ ఫిర్యాదులపై ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో విజిలెన్స్ అధికారులు బుధవారం దర్యాప్తు చేసారు . పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే గాని వాస్తవాలు వెలుగులోకి రావాలని తెలుస్తుంది. పరికరాలు, కంప్యూటర్ కొనుగోలులో ధరలు వ్యత్యాసం ఉన్నట్లు పరికరాలు కూడా నాణ్యత లేని కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

సాయిబాబా ఆలయ నిర్మాణానికి రూ.30 వేలు వితరణ



విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండలంలోని కొవ్వాడ గ్రామ సర్పంచ్ కోట్ల రఘు ఎర్రుకొండ గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న సాయిబాబా ఆలయం నిర్మాణం కోసం 30,000 రూపాయలు విరాళంగా ఇచ్చారు. బుదవారం ఉదయం సాయి బాబా ఆలయం కమిటీ సభ్యులు కొవ్వడలోని చర్పంచ్ ఇంటిలో కలిశారు.విషయం తెలియగానే వెంటనే తమ విరాళాన్ని ప్రకటించి నగదు అందచేశారు. ఈ కార్యక్రమంలో కోట్ల రఘుతోపాటు ఎర్రుకొండ సర్పంచ్ గొట్టపు అప్పలస్వామి, గోర్లు శ్రీనివాసు, ఆల్తి తవుడు, తడివాడ రామారావు, వెంపడాపు శ్రీనివాసు, తడివాడ అప్పలనాయుడు, వాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ బ్లాస్టింగ్ మెటీరియల్ గిడ్డంగికి అనుమతులిచ్చి మా జీవితాలను నాశనం చెయ్యోద్దు

గిడ్డంగికి ఆనుకొని ఉన్న వ్యవసాయ రైతులు ఆందోళన

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు శ్యామలాదేవి అగ్రహారం రెవిన్యూలో సర్వేనెంబర్ 4లో నిర్మించిన రాతి క్వారీల బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల నిల్వ గిడ్డంగికి అనుమతులు ఇచ్చి మా జీవితాలను నాశనం చేయొద్దు అంటూ బ్లాస్టింగ్ పదార్థాల నిల్వ గిడ్డంకి ఆనుకొని ఉన్న వ్యవసాయ రైతులు పద్మరాజు తాత, నాగిరెడ్డి తాతాలు నచ్చిరెడ్డి అప్పారావు,మడిగాన దేముడు తదితరులు ఆందోళన చెందుతున్నారు.మా వ్యవసాయ భూముల్లో వ్యవసాయం చేసుకుని జీవనోపాధి సాగిస్తున్నామని అలాంటి భూములు పక్కన బ్లాస్టింగ్ పదార్థాలు గిడ్డంగి అనుమతులు ఎలా ఇచ్చారో తెలియదని దీనికి పంచాయతీ నుంచి తీర్మానం ఇచ్చారని సంబంధిత గిడ్డంగి యజమాని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని.పంచాయతీ పాలకులు గిడ్డంగి నిర్మించే స్థలం చుట్టుపక్కల ఉన్నవారికి సమాచారం అందించకుండా తీర్మానం ఇవ్వడం ఎంతవరకు సబబని అదే పంచాయతీ పాలకులు వారి ఊరు అనుకొని గిడ్డంగి నిర్మాణానికి అనుమతులు ఇస్తే బాగుండేదని మాకు నష్టం వాటిల్లే విధంగా చేయడం ఎంతవరకు మంచి పద్ధతి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలాగే ఈ గిడ్డంగికి మా భూములకు అనుకొని రైతు వారి కల్లాలు కోళ్ల ఫారాలు, శ్యామలాదేవి అగ్రహారం ఇంకొంచెం దూరంలో వావిలపాడు గ్రామం అలాగే రాతి క్రషర్లకు వెళ్లే రహదారి నిరంతరం ట్రాన్స్పోర్ట్ రవాణా లారీలు, రాతిక్రసరులు కూడా ఉన్నాయని మధ్యలో ఈ గిడ్డంగి నిర్మించడానికీ అధికారులు అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా బ్లాస్టింగ్ గిడ్డంగికీ అనుమతులు ఇచ్చే అధికారులు పునరాలోచన చేసి మరోసారి దర్యాప్తుచేసి అనుమతులు ఇవ్వకుండా రైతులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్కు, జిల్లా ఎస్పీలకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని పద్మరాజు కృష్ణ, నాగిరెడ్డి దేముడునాయుడు తదితరులు అన్నారు. ఇదే విషమై గతంలో శ్యామలా దేవి అగ్రహారం గ్రామానికి చెందిన గ్రామస్తులు ఫిర్యాదులు ఇచ్చిన విషయం అధికారులు గుర్తు తెచ్చుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్ఛార్జిగా జెసి సేతు మాధవన్

విశాలాంధ్ర-విజయనగరం : ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్ఛార్జిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇకనుంచి జెసి ఆధ్వర్యంలో, ఆయన ఆదేశాలకు అనుగుణంగా గ్రంథాలయ సంస్థ కార్యకలాపాలు జరగనున్నాయి.

క్షయ వ్యాధి సంక్రమణ పరీక్షపై అవగాహన

విశాలాంధ్ర-మెంటాడ : మెంటాడపి.హెచ్.సి కార్యాలయంలో బుధవారం పి.హెచ్.సి వైద్య అధికారి డాక్టర్ లోకప్రియ క్షయ వ్యాధి సంక్రమణ పరీక్ష, సివై-టీబీ చర్మ పరీక్ష (క్షయ సోకిన రోగితో పాటు నివసించే వ్యక్తులకి చేయు పరీక్ష)ని ప్రారంభించి ఈ పరీక్ష గురించి అవగాహన కలిగించారు, క్షేత్రస్థాయిలో ఈపరీక్షని సమర్ధవంతగా అమలు ఆయ్యేవిధంగా చూడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పి.హెచ్.సి అధికారిని డాక్టర్ లోకప్రియ మాట్లాడుతూ క్షయ వ్యాధిని నిర్మూలించే కారక్రమములో భాగంగా భారత ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన ఈ పరీక్ష చాల ఉపయోగపడుతుంది అని తెలియచేసారు. డాక్టర్ కె.కల్పన మాట్లాడుతూ ఈ పరీక్షలో సంక్రమణ నిర్ధారణ అయితే టీబీ జబ్బు రాకుండ ముందస్తుగా వాడే మందులని ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది అని తెలియచేసారు. ఈకార్యక్రమంలో సి.హెచ్.ఓ సత్యనారాయణ హెచ్.వి జ్యోతి ఏఎన్ఎంలు సూపర్వైజర్ రమణ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి కొళాయి కనెక్షన్లు ప్రారంభం

ఎంపీడీఓ సిహెచ్ సూర్యనారాయణ

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వల్లంపూడి గ్రామంలో ఇంటింటి కొళాయి కనెక్షన్లను ఎంపీడీఓ సిహెచ్ సూర్యనారాయణ చేతులమీదుగా బుధవారం ప్రారంభించారు. పంచాయతీ నిధులు సుమారు రూ.5 లక్షల వ్యయంతో రామాలయం వీధి, పెద్ద దొడ్డి, ఏడువాకవీధి, నెయ్యిల వీధి, తురక దొడ్డి పరిధిలో ఇంటింటికి కొలాయి కనెక్షన్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో మంచి నీటికీ ఇబ్బంది లేకుండా ఉంటుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి రవి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దేవి, గ్రామ ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు సచివాలయం సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోషణ పక్వాడ్ కార్యక్రమంకు విశేష స్పందన

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలంలో పలు పోషణ పక్వాడ్ కార్యక్రమం బుధవారం సీడీపీఓ జాగాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి తల్లులు నుండి విశేష స్పందన లభించింది. శివడవలస జగన్నాథపురం, గున్న తోటవలస అంగన్వాడి సెంటర్ లో తల్లులకు 1000 రోజులు కేర్ గురించి అంటే తల్లి గర్భం దాల్చిన నుంచి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు ఆహారము పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎంపీటీసీ కి ఏఎన్ఎం మహిళా పోలీస్ తల్లులు అంగన్వాడి టీచర్స్ సెక్టార్ సూపర్వైజర్ గున్నతోటవలస. ఎం.శుభలక్ష్మి సూపర్ వైజర్. జగన్నాధపురం సూపర్ వైజర్ ఎన్. ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులు అరెస్టు

విశాలాంధ్ర- జామి: ఏ ఎస్ అర్ మన్యం నుంచి విజయనగరం నకు గంజాయి తరలిస్తూ ముగ్గురు యువకులు జామి పోలీసులకు పట్టుబడ్డారు.ఈ వివరాలను ఎస్.కోట సీఐ ఎల్. అప్పలనాయుడు బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఏ ఎస్ ఆర్ జిల్లా చింతపల్లి కి చెందిన కిలో జకరయ్య, గొర్లె శివరాజు తో పాటు మరో మైనర్ యువకుడు ముగ్గురు కలిసి ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి బైక్ పై విజయనగరం తరలిస్తుండగా జామి పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు ఎస్.ఐ వీర జనార్దన్ నిఘా పెట్టారు. పోలీసులను చూసి ముగ్గురు యువకులు బైక్ పై పరారవ్వడానికి ప్రయత్నించగా వారిని పోలీసులు ఎట్టకేలకు అలమండ సంత వద్ద పట్టుకున్నారు. వారి వద్ద దాదాపు 3 కిలోల గంజాయి లభ్యమయింది. వీటితోపాటు వారి వద్దనున్న రెండు సెల్ ఫోన్ లను, 500 రూపాయలు నగదును,మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక తాసిల్దార్ భరత్ కుమార్ పర్యవేక్షణలో గంజాయిని పరిశీలించారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పౌరసరఫరాల గడ్డింగిని జాయింట్ కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర-భోగాపురం : భోగాపురంలోని పౌరసరఫరాల గిడ్డంగిని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ బుధవారం పరిశీలించారు. గిడ్డంగిలో ఉన్న బియ్యం, పంచదార తదితర వస్తువులను పరి శీలించారు. అనంతరం రికార్డులో ఉన్న స్టాకుకు, గిడ్డంగిలో ఉన్న సరుకుల వ్యత్యాశాన్ని కూడా తనిఖీ చేశారు. అలాగే సరుకులు నాణ్యతను సైతం పరిశీలించారు. పౌరసరఫరాల డిఎం మీనా కుమారి, ఉప తాసిల్దారు సుభాష్, సి ఎస్ డి టి మురలీకృష్ణ, గోడాన్ ఇంచార్జ్ స్వర్ణలత, ఆర్ ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

15 బైకులు, 16 సెల్ ఫోన్లు సీజ్

విశాలాంధ్ర-రామభద్రపురం : మండలంలోని మిర్తి వలస మధుర గ్రామమైన కాకర్లవలస సమీపంలో బుధవారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసి16 వ్యక్తులను పట్టుకున్నామని స్థానిక ఎస్సై వెలమల ప్రసాదు తెలిపారు. వీరు వద్ద నుంచి ఒక లక్ష 72,000 ఎనిమిది వందల రూపాయలు నగదు 15 బైకులు, 16 ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని అన్నారు. అలాగే వాహనాలను కూడా సీజ్ చేసామని. ఈ దాడిలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.